## కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



కేసీఆర్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ దంపతులు

గంగాధర, ఫిబ్రవరి 25: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తన పెళ్లిరోజు సందర్భంగా కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. తిరుమల తిరుపతి నుంచి తీసుకువచ్చిన వేంకటేశ్వరస్వామి ప్రతిమను రవిశంకర్ దంపతులు కేసీఆర్‌కు అందజేశారు.

## వాణీకేతన్‌లో ఘనంగా 'తరంగ్-2025'



జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న పాఠశాల డైరెక్టర్ రేణుక, అతిథులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 25 : ముకరంపురలోని వాణీనికేతన్‌లో తరంగ్–2025 పేరిట 56వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రేణుక వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ప్రముఖ విద్యావేత్త దివంగత అయోధ్య రామారావు స్థాపించిన విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులు ప్రపంచ నలుమూలల ఉన్నతంగా స్థిరపడ్డారని, ఇది తమకు ఎంతో సంతోషానిస్తున్నదని పేర్కొన్నారు. విద్యార్థుల సంపూర్ణ వికాసమే ధ్యేయంగా పాఠశాలలో ఐటీ ఫౌండేషన్, కాంపీటిషన్ టెస్ట్, కంప్యూటర్ బోధన, క్రీడలు, విజ్ఞాన, విహార యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. పారా అథ్లెట్ అంజనారెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ హనుమంతరావు, నీలకంఠం, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిబద్ధత, క్రమశిక్షణతో వ్యవహరిస్తేనే గుర్తింపు



సీడీపీవో కస్తూరిని సన్మానిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణి

గంగాధర, ఫిబ్రవరి 25: ఉద్యోగ సమయంలో నిబద్ధత, క్రమశిక్షణతో వ్యవహరించే ఉద్యోగులకు సంతృప్తితో పాటు గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు అనుమాండ్ల శోభారాణి అన్నారు. మధురానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో గంగాధర ఐసీడీఎస్ సీడీపీవో మేకా కస్తూరి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. 40 సంవత్సరాలుగా మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ హోదాల్లో, వివిధ ప్రాంతాల్లో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమని కొనియాడారు. అంతకుముందు కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో దమ్మని రాము, ఎంపీవో జనార్దన్ రెడ్డి సీడీపీవోను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి కరీంనగర్ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగశేఖర్, విజయ్, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన సీడీపీవోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'భవిత'తో దివ్యాంగుల్లో మనోవికాసం

- కేంద్రాల నిర్వాహణకు మరిన్ని సౌకర్యాలు
- విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

మానకొండూర్, ఫిబ్రవరి 25: భవిత కేంద్రాలు దివ్యాంగ చిన్నారుల్లో మనోవికాసానికి దోహదపడుతాయని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని భవిత కేంద్రాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా పేర్కొన్నారు. మానకొండూర్ మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, భవిత కేంద్రం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో యోగితారాణా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని భవిత కేంద్రాల్లో ఒకే టైంటేబుల్, సిలబస్‌ను నిర్ణయించి అమలు చేయనున్నట్లు తెలిపారు. కేంద్రం నిర్వహణకు కావాల్సిన అవసరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దివ్యాంగుల విద్యార్థులతో ముచ్చటించారు. టీచింగ్ మెటీరియల్‌ను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. భవిత కేంద్రంలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ ప్రత్యేక డైరీ నిర్వహించాలని, అవసరమైన టీచింగ్, లర్నింగ్ మెటీరియల్ సమకూరుస్తామన్నారు. జిల్లా యంత్రాంగం తరపున రెయిలింగ్‌తో కూడిన ర్యాంపులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పనిచేస్తున్న సిబ్బంది వివరాలతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన కేంద్రంలో స్పీచ్ థెరపిస్ట్‌ను నియమించుకోవాలని, ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవాలని సూచించారు. అన్ని భవిత కేంద్రాలకు రంగులు వేయించి, తాగునీటి సౌకర్యం కల్పించాలని, అవసరైన చోట స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లను నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, క్వాలిటీ కోఆర్డినేటర్, అశోక్‌రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి పాల్గొన్నారు.



మానకొండూర్: భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థిని ఆప్యాయంగా పలుకరిస్తున్న విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

### దివ్యాంగుల పునరావాస కేంద్రం, డైట్ కళాశాల సందర్శన

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25: నుస్తులాపూర్ గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సందర్శించారు. పిల్లలను కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. సిబ్బందిని పలు అంశాలను అడిగారు. చిన్నారులకు ఇబ్బంది లేకుండా బోధించాలని సూచించారు. అలాగే, ఎల్ఎండీలోని డైట్ కళాశాల సందర్శించారు. సమాజాన్ని సక్రమ మార్గంలో నడిపించేది ఉపాధ్యాయులేనని, డైట్ విద్యార్థులు ఉపాధ్యాయులుగా రాణించాలని సూచించారు. డీఆర్డీవో శ్రీధర్, జేడీ వెంకటనర్సమ్మ, డీఈవో జనార్దన్‌రావు, డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య, ఏపీఎం రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సైన్స్‌ఫెస్ట్, టీఎల్ఎం క్రాఫ్ట్ మేళా

మానకొండూర్, ఫిబ్రవరి 25: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్ ఫెస్ట్‌లు దోహదపడుతాయని జిల్లా సైన్స్ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి సైన్స్‌ఫెస్ట్, టీఎల్ఎం క్రాఫ్ట్‌మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యర్థపదార్థాలతో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ఎక్స్‌పర్‌మెంట్స్ ఆకట్టుకున్నాయి. ఇందులో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో పాటు కేజీబీవీ, మోడల్ స్కూల్‌కు చెందిన ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి అధికారులు బహుమతి ప్రదానం చేసి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి మధుసూదనాచారి, వివిధ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు డీ శ్రీనివాస్, వెంకట్‌రాంరెడ్డి, రాజభాను చంద్రప్రకాశ్, శ్రీనివాస్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 'ముందస్తు అడ్మిషన్లకు అడ్డుకట్ట వేయాలి'

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 25 : రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ చైతన్య, నారాయణ కళాశాలల ముందస్తు అడ్మిషన్లకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి, ముందస్తు అడ్మిషన్ల కోసం కార్పొరేట్ కళాశాలలకు ప్రైవేటు పాఠశాలలు సహకరిస్తే ఊరుకునేది లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ తేల్చిచెప్పారు. జిల్లా కేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ నాయకులతో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం పూర్తి కాకముందే జిల్లాల్లో పీఆర్వోలను పెట్టుకుని ప్రచారం నిర్వహిస్తూ తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు తీసుకుంటున్నారని, అధికారులు, ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామారావు, వెంకటేశ్, కనకం సాగర్, మామిడిపల్లి హేమంత్, కనకం రాహుల్ పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్లలో లోపాల గుర్తింపునకు థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు

ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ రమేశ్ బాబు

ముకరంపుర, ఫిబ్రవరి 25: సబ్ స్టేషన్లలో సూక్ష్మ లోపాలను గుర్తించేందుకు థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు వినియోగిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ రమేశ్ బాబు పేర్కొన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట్ల ఇప్పటి వరకు 6 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయగా మరో 7 పీటీఆర్‌ల సామర్థ్యం పెంచినట్లు తెలిపారు. నాలుగు బంచ్ ఫీడర్లను వేరు చేసినట్లు తెలిపారు. కొత్తగా 195 టాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా, మరో 159 డీటీఆర్‌ల సామర్థ్యం పెంచినట్లు పేర్కొన్నారు. పీక్ లోడ్ సమయంలో టాంగ్ టెస్టర్ రీడింగ్‌తో ట్రాన్స్ ఫార్మర్ల లోడ్ తెలుసుకుని వాటి సామర్థ్యాన్ని సత్వరమే పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేశామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**ట్రాన్స్ ఫార్మర్లు ప్రారంభం:** నగరంలోని టౌన్–9 సెక్షన్ వినాయక నగర్ ఎస్ఎస్–6పై ఓవర్ లోడ్ భారాన్ని తగ్గించేందుకు కొత్తగా 100కేవీఏ, వినాయక నగర్‌లోని ఎస్ఎస్–6 వద్ద ఏర్పాటు చేసిన 100కేవీఏ డీటీఆర్‌ను ఎస్ఈ మేక రమేశ్ బాబు, డీఈ రాజం మంగళవారం ప్రారంభించారు. టౌన్–2 ఏడీఈ లావణ్య, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

***సర్క్యూట్, బ్రేకర్స్ ప్రారంభం***

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 25: ఊటూర్ సబ్ స్టేషన్‌లోని వేగురుపల్లి, మామిడాలపల్లి 11 కేవీ ఫీడర్‌లకు వేర్వేరుగా సర్క్యూట్, బ్రేకర్స్ ఏర్పాటు చేయగా, ఎస్ఈ రమేశ్ డీఈ తిరుపతితో కలిసి ప్రారంభించారు. అలాగే, మానకొండూర్ సబ్ స్టేషన్‌లో పరిధిలో వేసవి దృష్ట్యా విద్యుత్ అంతరాయం కలగకుండా మూడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాలనపై ఎమ్మెల్సీ ఎన్నికలు రెఫరెండంగా తీసుకుందామా?

- సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్



మాట్లాడుతున్న బండి సంజయ్

విద్యానగర్, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ 14 నెలల పాలన బాగుందని విర్రవీగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగా తీసుకునేందుకు సిద్ధమా? అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్పతో కలిసి బండి సంజయ్ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణలో ఇండియా టీం, పాకిస్తాన్ టీం మధ్య మ్యాచ్ లాంటివని, ఇండియా గెలవాలనుకుంటే బీజేపీకి, పాకిస్తాన్ గెలవాలనుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని సూచించారు. బీజేపీ గెలిస్తే పట్టభద్రులు, టీచర్ల ఆకాంక్షలను నెరవేరుస్తామన్నారు.

## నిరుద్యోగ నిర్మూలనకు ప్రభుత్వం కృషి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మంత్రి పొన్నం



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25: నిరుద్యోగ నిర్మూలనకు కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతున్నదని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ చెప్పారు. మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రైవేట్ టీచర్లతో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. బీజేపీ మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. అలాగే, మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం వచ్చాక చేసిన అభివృద్ధి పనులను చూసే ఓటేయాలని కోరారు. నిరుద్యోగులకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, మామిడి అనిల్, బండారి రమేశ్, గంకిడి లక్ష్మారెడ్డి, పోలు రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో బలహీన వర్గాల ప్రాధాన్యత పెరుగాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 25: చట్టసభల్లో బలహీన వర్గాల ప్రాధాన్యత పెరుగాలని బీఎస్పీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ గౌడ్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ధన బలంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు పట్టభద్రుల సమస్యలు తెలియవని విమర్శించారు. వారి వ్యాపార సంస్థలను కాపాడుకోడానికే రాజకీయాల్లోకి వస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఇంకా 19 సంవత్సరాల సర్వీసు ఉన్నప్పటికీ నిబద్ధతతో నిస్వార్థంగా సేవ చేయాలని లక్ష్యంతో తాను పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బలహీన వర్గాలు తమకు దక్కాల్సిన రాజ్యాంగ హక్కులను సాధించుకోవాలంటే చట్టసభల్లో బలహీన వర్గాల ప్రతినిధులు ఉండాలన్నారు. యువత, పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, బీసీ అభ్యర్థిగా బరిలో ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడుకోవాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 25: ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుహాసిని అన్నారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గతంలో శాసనమండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేధావులు, విద్యావేత్తలు పోటీ పడేవారని గుర్తు చేశారు. కానీ, నేడు వ్యాపారులు, కార్పొరేట్ సంస్థల అధిపతులు తమ ధన బలంతో ఎన్నికల్లో బరిలో ఉంటున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, గురుతర బాధ్యతగా నిస్వార్థంగా సేవ చేయాలనే లక్ష్యంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## 'నిరుద్యోగ భృతి ఇవ్వనోళ్లు పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తారా?'

విద్యానగర్, ఫిబ్రవరి 25 : అధికారంలోకి వచ్చి 14 నెలలైనా నిరుద్యోగ భృతి ఇవ్వలేని దుస్థితిలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలు ఎలా పరిష్కరిస్తుందని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ప్రశ్నించారు. మంగళవారం కరీంనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ భృతి, ఏటా జాబ్ క్యాలెండర్ లాంటి ప్రధాన హామీలతో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నిరుద్యోగ యువతీ యువకులను నిలువునా మోసం చేసిందన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, రాష్ట్ర కార్యదర్శి యువ క్రాంతి, నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

CHANGE OF NAME
★ I Palle Srilatha (New Name) Previously MANTRI SATYADEVI (Old Name) W/o. Palle Rajashekar R/o. H.No. 2-88/A/3, Jawaharpet Vill. Ellanthakunta Mdl . Rajanna Sircilla Dist.TS. and Solemnly declare
NTK-00000

CHANGE OF NAME
★ Asiniparthy Nandaiah S/o. Ramaswamy H.No. 4-44, R/o. Yengal, Chandurthy Mandal Rajanna Sircilla Dist. Hereby by Declared I Have Changed My son name from Asiniparthy Kevin ken (Old Name) to **Asiniparthy Vikram** (New Name)
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 25: డిగ్రీ విద్యార్థులు తమ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని, కార్పొరేట్ రంగంలో ఉన్న విస్తృతమైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాసెస్ మల్టీపుల్ కెరియర్ సర్వీసెస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఫీన్ వర్స్, ఎస్ఎస్‌ప్లస్, ఐటీ సొల్యూషన్స్, ఫిన్వర్డ్ కంపెనీల హెచ్‌ఆర్ మేనేజర్లు కందుకూరి సత్యనారాయణ, కొరిమి పీతాంబర్, వినయ్ తదితరులు విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడో సంవత్సరం చదువుతున్న 82 మంది విద్యార్థులు హాజరుకాగా, ఇందులో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వొడితల ఇంద్రనీల్, ప్రిన్సిపాల్ హనుమకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, కార్పొరేట్ రంగంలోనే కాకుండా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలైన గ్రూప్ వన్ గ్రూప్ 2 వంటి నోటిఫికేషన్లపై కూడా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు అవసరమైన శిక్షణను కళాశాల అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శనిగరపు రజిత, ప్లేస్మెంట్స్ ఆఫీసర్ తాళ్లపల్లి అజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ పోతిరెడ్డి హరీశ్, భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 25: బీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లలో సబ్ కోటా కల్పించాలనే డిమాండ్‌తో మార్చి 18, 19వ తేదీల్లో నిర్వహించతలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ బీసీ మహిళా సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వరూపాశ్యామ్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రం బీసీ మహిళల సబ్ కోటాకు రాజ్యాంగ బద్ధంగా రక్షణ కల్పించాలన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ సబ్ కోటా బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకుల పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మానకొండూర్, ఫిబ్రవరి 25: మండల కేంద్రానికి చెందిన కటుకోజ్వల హరిప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. మృతుడి స్నేహితులు మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి (1990–91) బ్యాచ్ విద్యార్థులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇక్కడ మిత్రులు గసిగంటి మల్లికార్జున్, గుర్రం అశోక్‌గౌడ్, కొట్టె రాజు, వైద మల్లయ్య, రంగు ప్రభాకర్, రామిడి చుక్కయ్య, గర్రెపల్లి సతీశ్, వనం కృష్ణమూర్తి, ఆరెపల్లి సునంద్, దాసరి భూమేశ్ ఉన్నారు.

## ఘనంగా ఫేర్‌వెల్ డే



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిని గజమాలతో సన్మానిస్తున్న అధ్యాపకులు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 25: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆంజనేయరావు ఆధ్వర్యంలో మంగళవారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కళాశాలతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని బాగా చదివి, అందరు ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు మదన్ మోహన్ రావు, సత్యవర్ధన్ రావు, శశిధర్ శర్మ, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

చిగురుమామిడి, ఫిబ్రవరి 25: రేకొండ గ్రామానికి చెందిన నాగిళ్ల చిలుకవ్వ సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ అందె స్వామి, బోయిని అశోక్ ఉన్నారు.

## వైన్స్‌లకు సీల్



సీల్ వేయిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ భారతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25: గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం సాయంత్రం 4గంటలకు మండలంలోని వైన్సులు క్లోజ్ చేసి సీల్ వేశారు. ఎక్సైజ్ పోలీసులు వైన్స్‌ల షెట్టర్లు మూసివేసి సీల్ చేస్తుండడంతో స్థానికులు, మందుబాబులు అయోమయానికి గురయ్యారు. ఓ వైపు అధికారులు సీల్ వేస్తుంటే తిమ్మాపూర్‌లోని వైన్స్ నిర్వాహకులు ఇంకా సమయం ఉందంటూ అమ్మకాలు కొనసాగించారు. దీంతో ఎస్ఐ పూర్తిగా మూసివేయించి సీల్ వేశారు. గురువారం ఎన్నికలు పూర్తయ్యాక సాయంత్రం 4గంటలకు తమకు సమాచారం అందించి ఓపెన్ చేసుకోవాలని నిర్వాహకులకు ఆమె సూచించారు.

## గొర్రెల కాపరుల సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు రాజ్‌కుమార్

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 25: హుజూరాబాద్ ప్రాథమిక గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడిగా బద్దుల రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఈ మంజుల తెలిపారు. మంగళవారం సహకార సంఘం డైరెక్టర్లుగా ఎంపికైన ఏడుగురిలో అధ్యక్ష స్థానానికి రాజ్‌కుమార్ ఒక్కరే నామినేషన్ వేయడంతో, ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా భాషబోయిన రవి, డైరెక్టర్లుగా గంద్రకోట సారయ్య, బాషబోయిన రవి, లెంకలపల్లి రవీందర్, సింగరవేణి రవి, చేపూరి కొమరమ్మ, డీ స్వరూప ఎన్నికైనట్లు తెలిపారు.

## శ్రీ చైతన్యలో ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25: ఎల్ఎండీ కాలనీలోని శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సీఎస్ఈ ఆధ్వర్యంలో స్వాగత్ పేరుతో, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో గైరేషన్ పేరిట నిర్వహించిన పార్టీల్లో విద్యార్థులు ఉర్రూతలూగించారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, నాణ్యతతో కూడిన విద్య అందిస్తున్నామని, వంద శాతం పాస్, వంద శాతం ప్లేస్‌మెంట్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపల్స్, హెచ్‌వోడీలు, తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుడికి డాక్టరేట్

తిమ్మాపూర్, ఫిబ్రవరి 25: ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న కందుకూరి చంద్రసేనాచారికి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ సతీశ్ నారాయణ్ పర్యవేక్షణలో 'అన్విలింగ్ ది షీల్డ్: ఏ కంపెరిటీవ్ డాటా మైనింగ్ ఎనాలిసిస్ ఆఫ్ మెషిన్ లర్నింగ్ ఆల్గోరిథమ్స్ ఫర్ ఎన్హాన్స్ ఇంట్రుషన్ డిటెక్షన్ ఇన్ నెట్‌వర్క్ ట్రాఫిక్' అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు చెప్పారు. ఆయనను ప్రిన్సిపాల్ ప్రసాదరాజుతో కలిసి అభినందించారు.

## బస్టాండ్ ఆవరణలో మంటలు

- కాలిన హరితహారం మొక్కలు

శంకరపట్నం, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఉదయం పూట బస్టాండ్ వెనుక వైపు ఖాళీ స్థలంలో గడ్డికి మంటలు వ్యాపించి క్రమంగా విస్తరించాయి. గతంలో హరితహారంలో భాగంగా బస్టాండ్ ఆవరణలో నాటిన మొక్కలు మంటల్లో కాలిపోయాయి. పార్కింగ్ నిర్వాహకుడు ఆంజయ్య, తదితరులు పచ్చి చెట్ల కొమ్మలతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ వెలిగించి పడేయడం వల్ల మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

## హైస్కూల్‌లో ఆకతాయిల ఆగడాలు



కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకతాయిలు విరగ్గొట్టిన నల్లా

శంకరపట్నం, ఫిబ్రవరి 25: మండలంలోని కేశవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో రోజురోజుకూ ఆకతాయిల ఆగడాలు పెచ్చు మీరుతున్నాయి. సోమవారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయిలు పాఠశాల ఆవరణలో గల తాగునీటి నల్లా విరగ్గొట్టారు. మంగళవారం ఉదయం మార్నింగ్ వాకింగ్ వచ్చిన యువకులకు విరగ్గొట్టిన నల్లా కనిపించింది. స్టాపర్ లేకపోవడంతో ట్యాంక్‌లో ఉన్న తాగు నీరంతా వృధాగా పోయింది. కాగా, ఇటీవల స్కూలు ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రుళ్లు ఆకతాయిలు చేరి మద్యం తాగి బాటిళ్లు పగులగొట్టి వేయడం, పాన్, గుట్కాలు నమిలి ఉమ్మివేయడం, సిగరెట్లు ఊది పీకలను వరండా, మైదానంలో పడేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఇలాంటి ఘటనలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా చర్యలు చేపట్టాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా ఎక్స్ ప్లోరికా పాఠశాల క్రీడా వార్షికోత్సవం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న పాఠశాల డైరెక్టర్

కొత్తపల్లి, ఫిబ్రవరి 25 : స్థానిక జ్యోతినగర్ ఎక్స్ ప్లోరిక పాఠశాల వార్షిక క్రీడా వార్షికోత్సవం 'స్పోర్ట్స్ స్పార్ట' పేరుతో తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ వీయూఎం ప్రసాద్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఉల్లాసాన్ని నింపేందుకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్‌రావు, రష్మిత, రాకేశ్, ప్రాచీ, వినోద్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు బల్దియా సిబ్బంది

కార్పొరేషన్, ఫిబ్రవరి 25: వేములవాడలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ స్థాయిల్లో విధులు నిర్వహించేందుకు నగరపాలక సంస్థకు చెందిన పారిశుధ్య విభాగం సిబ్బంది మంగళవారం తరలివెళ్లారు. ఈ విభాగంలోని నలుగురు జవాన్లతో పాటు, 32 మంది కార్మికులు, ఇద్దరు డ్రైవర్లకు అధికారులు ఉత్సవాల్లో విధులు కేటాయించగా, మంగళవారం ఒక పారిశుధ్య ట్రాక్టర్‌తో నగరం నుంచి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, పర్యావరణ ఇంజినీర్ స్వామి, జవాన్లు శ్రీనివాస్, భాస్కర్, నాగరాజు, చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

## వేడుకగా వీడ్కోలు సమావేశం

గంగాధర, ఫిబ్రవరి 25: మధురానగర్ చౌరస్తాలోని సురభి పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు కార్యక్రమంలో కరస్పాండెంట్ చిప్ప వీరేశం మాట్లాడుతూ, విద్యార్థులు ప్రణాళికతో చదివి రానున్న 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ వీర నరసయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం